

దోమకొండలో విద్యార్థులకు నగదు పురస్కారాలను అందజేస్తున్న దృశ్యం



బోనస్‌కు నిరీక్షణ

- సన్న రైతులకు అందని బోనస్
- జిల్లా వ్యాప్తంగా రూ.88 కోట్లు పెండింగ్
- 30,700 మంది రైతులకు తప్పని నిరీక్షణ
- రైతుల ఖాతాలో జమకాని బోనస్ నిధులు
- ప్రభుత్వం నుంచే విడుదల కాని నిధులు
- యాసంగిలో 3.82 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు

కామారెడ్డి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): యాసంగి ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయి. వానాకాలం పంటల సాగుకు రైతులు సిద్ధం అవుతున్నారు. అయితే సన్న రకం ధాన్యాన్ని పండించే రైతులకు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం బోనస్ రూ.500 రెండు సీజన్‌లుగా అందిస్తోంది. గత వానాకాలంలో బోనస్ సకాలంలో చెల్లించినప్పటికీ యాసంగిలో మాత్రం కొనుగోలు పూర్తయిన బోనస్ డబ్బులు మాత్రం రైతుల ఖాతాలో జమకావడం లేదు. దీంతో సన్నాల సాగుపై రైతులు సందిగ్ధంలో పడుతున్నారు. సన్న రకం వరి సాగు చేస్తే దిగుబడులు తక్కువగా వస్తున్నప్పటికీ ప్రభుత్వం బోనస్ ఇస్తుండడంతో ఆ పంటవైపే మొగ్గు చూపుతున్నారు. దీంతో యాసంగిలో పెద్ద మొత్తంలోనే రైతులు సన్నాలను సాగు చేశారు. ప్రభుత్వం బోనస్ చెల్లించకపోవడంతో రైతులు సన్నాలు సాగు చేయాలా వద్దా అని ఆలోచిస్తున్నారు. బోనస్ కోసం రైతులు నిరీక్షిస్తున్నారు. వెంటనే బోనస్ డబ్బులు చెల్లించాలని ప్రభుత్వాన్ని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ధాన్యం డబ్బులు రూ.850 కోట్లకు పైగా చెల్లింపులు

జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు రూ.850 కోట్ల విలువ చేసే 3,82,680 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 72,586 మంది రైతుల నుంచి కొనుగోలు చేశారు. రైతుల ఖాతాలో రూ.850 కోట్ల ధాన్యం డబ్బులను జమ చేశారు. ధాన్యం కొనుగోళ్లలో జిల్లా రాష్ట్రవ్యాప్తంగా ఐదో స్థానంలో ఉండగా ధాన్యం డబ్బులు చెల్లించడంలోనూ ముందు వరసలోనే ఉంది. బాన్సువాడ డివిజన్‌లో 96,723 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా జుక్కల్‌లో 77,710 మెట్రిక్ టన్నులు, ఎల్లారెడ్డిలో 1,19,247 మెట్రిక్ టన్నులు, కామారెడ్డిలో 84,182 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. జిల్లావ్యాప్తంగా 446 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించారు.

పెండింగ్‌లో రూ.88 కోట్ల బోనస్ డబ్బులు

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు పూర్తయి పక్షం రోజులు గడుస్తున్నా బోనస్ డబ్బులు మాత్రం పడడం లేదని రైతులు మండిపడుతున్నారు. ఈ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 1.67 లక్షల మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇందులో ఇప్పటి వరకు 1.48 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించి 30,700 మంది రైతులకు మద్దతు ధర డబ్బులను ఆయా రైతుల ఖాతాలో జమ చేశారు. కానీ బోనస్ రూ.88 కోట్లు మాత్రం పెండింగ్‌లో ఉంచారు. ధాన్యం కొనుగోలు చేసిన కేవలం రెండు రోజుల్లోనే పూర్తిస్థాయిలో డబ్బులు రైతుల ఖాతాలో పడుతాయని ప్రభుత్వం చెబుతోంది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం భిన్నంగా కనిపిస్తోంది. ధాన్యం కొనుగోళ్లు పూర్తయి రోజులు గడుస్తున్నా బోనస్ డబ్బులు మాత్రం పడడంలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం సన్న రకం ధాన్యానికి బోనస్ అమలు చేస్తుందా లేదా అని అయోమయానికి గురవుతున్నారు.

యాసంగిలో పెరిగిన సన్నాల సాగు

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్‌ల పరిధిలో సన్న రకం వరి సాగు ఈ యాసంగి సీజన్‌లో భారీగా పెరిగింది. సాధారణంగా ఇక్కడి రైతులు వానాకాలం సీజన్‌లో సన్నాలు, యాసంగిలో దొడ్డు రకం పండించేవారు. అయితే ప్రభుత్వం సన్నాలకు రూ.500ల చొప్పున బోనస్ ఇస్తామని ప్రకటించడంతో యాసంగి సీజన్‌లోనూ రైతులు సన్నాల సాగుకే మొగ్గు చూపారు. జిల్లాలో ఇప్పటి వరకు 3,10,014 మెట్రిక్ టన్నుల ధాన్యం

(మిగతా 8వ పేజీలో)

దోమకొండ గడికోటలో..

సామూహిక అక్షరాభ్యాసం

- పదవ తరగతి విద్యార్థులకు నగదు పురస్కారాల అందజేత

దోమకొండ, జూన్ 15(ఆంధ్రజ్యోతి): దోమకొండ మండల కేంద్రంలోని గడికోటలో ఆదివారం 170 మంది చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని గడికోట వారసులు కామినేని అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాదేవుని ఆలయంలో ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సరస్వతీ పూజ కార్యక్రమాన్ని నిర్వహించి చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు 2025 సంవత్సరంలో 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఐదుగురు విద్యార్థులు సుమయ, నవదీప్‌కు రూ.25వేల చొప్పున, సన్నిహితకు రూ.20వేలు, రేవతికి రూ.18వేలు, రాహుల్‌కు రూ.15వేల నగదు పురస్కారాన్ని గడికోట వారసులు అనిల్‌కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా గడికోట వారసులు అనిల్‌కుమార్ మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం గడకోటలో సామూహిక అక్షరాభ్యాస్యం కార్యక్రమాన్ని నిర్వహించడంతో పాటుగా పదవ తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు పురస్కారం అందించి సత్కరించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, సొసైటీ చైర్మన్ పన్యాల నాగరాజు, మాజీ ఎంపీటీసీ నల్లవు శ్రీనివాస్, ట్రస్ట్ మేనేజర్ బాబ్జి, ప్రతినిధులు గణేష్‌యాదవ్, ఆనంద్, రాజశేఖర్, వెంకటలక్ష్మీ, కల్పన, అంగన్‌వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



గొట్టిముక్కల గ్రామంలో బోనాలను తీస్తున్న దృశ్యం

పోచమ్మకు బోనాల సమర్పణ

దోమకొండ, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్టిముక్కల గ్రామంలో ఆదివారం పోచమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్లకు గ్రామస్థులు బోనాలు సమర్పించారు. గత సంవత్సరం గ్రామానికి చెందిన ముదాం గంగరాజు - గాయత్రి, శ్రీనివాస్-హరిత దంపతులు పోచమ్మ ఆలయ పునఃనిర్మాణ కార్యక్రమానికి దాతలుగా నిలిచారు. కాగా ఆలయంలో ఉదయం నుంచి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు గంగరాజు, శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతీ సంవత్సరంలాగానే ఈ సంవత్సరం సైతం పోచమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్లకు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

తగ్గుతున్న చిన్నారుల కంటి చూపు

- పోషకాహారం, శారీరక శ్రమ లేకపోవడం
- టీవీలు, స్మార్ట్‌ఫోన్ వాడకం మరో కారణం



7

జొన్న డబ్బుల కోసం రైతుల ఎదురుచూపులు

- 162 మంది రైతులు
- 3 వేల క్వింటాళ్ల జొన్నలు విక్రయం
- ఆందోళనలో రైతులు



7

టీయూలో బాలికల హాస్టల్‌కు శంకుస్థాపన జరిగేనా?

- జూలైలో టీయూ స్నాతకోత్సవం
- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరయ్యే అవకాశం



7



సిద్ధరామేశ్వర నగర్‌లో ధ్వంసమైన కారు

భిక్కనూరు వద్ద కారు బోల్తా

- అదనపు కలెక్టర్ సీసీ రాజశేఖర్‌తో పాటు కుటుంబ సభ్యులకు గాయాలు

భిక్కనూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి):మండలంలోని సిద్ధ రామేశ్వరనగర్ గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో జిల్లా అదనపు కలెక్టర్ చందర్‌నాయక్ సీసీ రాజశేఖర్, తన స్నేహితుడు మోహన్‌తో పాటుగా వారిరువురి కుటుంబ సభ్యులకు గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. రాజశేఖర్, తన స్నేహితుడు మోహన్‌తో పాటుగా వారిరువురి కుటుంబ సభ్యులతో కలిసి కారులో మెదక్ జిల్లా నాచారంలోని ఆలయానికి దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా భిక్కనూరు మండలంలోని సిద్ధ రామేశ్వరనగర్ గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై ముందువెళ్తున్న వాహనాన్ని తప్పించబోయి ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రాజశేఖర్ అతడి భార్య నిహారిక, కుమారులు అద్వైత్, ఆరూస్‌తో పాటుగా మోహన్, అతడి కుమారుడు ఆగస్త్యలకు గాయాలయ్యాయి. ఇదే సమయంలో ఇటుగా వస్తున్న కామారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ వెంటనే తన వాహనాన్ని ఆపి కారులో నుంచి గాయపడిన వారిని వాహనదారులు, స్థానికుల సహాయంతో బయటకు తీసి పోలీసులకు సమాచారం అందించారు. గాయపడిన వారిని వెంటనే గ్రంథాలయ సంస్థ చైర్మన్ తన కారులో కామారెడ్డిలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం రోడ్డుపై నిలిచిపోయిన ట్రాఫిక్‌ను పోలీసులు పునరుద్ధరించారు.



గాయపడిన వారిని కారులో తరలిస్తున్న దృశ్యం

కష్టజీవికి బాసటగా నిలబడిన కవి శ్రీశ్రీ



మాట్లాడుతున్న తెరవే జిల్లా అధ్యక్షుడు గఫూర్ శిక్షక్

కామారెడ్డి టౌన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కార్మిక, కర్షక లోకానికి అండగా నిలబడి తన రచనలతో సమాజంలో మార్పులు తెచ్చిన మహాకవి శ్రీశ్రీ అని తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షుడు గఫూర్ శిక్షక్ అన్నారు. ఆదివారం ఆయన వర్ధంతి సందర్భంగా కర్షక్ బీఈడీ కళాశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. శ్రీశ్రీ ఒక అభ్యుదయ కవిగా, విప్లవ కవిగా, శ్రామిక వర్గానికి ప్రతినిధి తన రచనలు చేసి తెలుగు సాహిత్యంలో విప్లవాత్మక మార్పులు తెచ్చాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు గంగాప్రసాద్, కాసర్ల రామచంద్రం, నాగభూషణం, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తా..

- ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

రాజంపేట, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలంలోని పొందుర్తి, తలమడ్ల గ్రామాల్లోని ఆలయాల్లో ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి ఆదివారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం పెద్దమ్మ ఆలయంలో, హనుమాన్ ఆలయంలో, తలమడ్ల గ్రామంలో రజక సంఘం శ్రీ మడివేటు మాచయ్య స్వామి సీతల దేవి కల్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. గ్రామాల్లో ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, ముదిరాజ్, రజక సంఘం ఆలయ పెద్దలు, గ్రామ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

అంగన్‌వాడీల్లోనే భవిష్యత్తుకు బాటలు

- అమ్మ మాట - అంగన్‌వాడీ బాట నిర్వహణ
- జిల్లాలోని అంగన్‌వాడీలో విస్తృతంగా కొనసాగుతున్న కార్యక్రమం
- అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్య పెంచేందుకు చర్యలు
- ఈనెల 17 వరకు కార్యక్రమాలు

కామారెడ్డి టౌన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): చిన్నారులకు ఉజ్వల భవిష్యత్తు అందించేలా అంగన్‌వాడీ కేంద్రాలను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించి ఆరోగ్యం, ఆట పాటలతో కూడిన సృజనాత్మకమైన విద్యనందించడమే లక్ష్యంగా జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో అమ్మమాట - అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని చేపడుతున్నారు. తల్లిదండ్రులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలను భాగస్వాములను చేస్తూ ఈనెల 17 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బడీడు పిల్లల కోసం బడిబాట నిర్వహిస్తుండగా, గతేడాది నుంచి 2.5 నుంచి ఆరేళ్లలోపు చిన్నారుల కోసం అంగన్‌వాడీ బాట కార్యక్రమం చేపడుతున్నారు. గత సంవత్సరం నిర్వహించినా కార్యక్రమాలు సత్ఫలితాలను ఇవ్వడంతో ఈ ఏడాది సైతం ఐసీడీఎస్ సిబ్బంది కార్యక్రమాలు చేపడుతున్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మ మాట - అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

ఆట పాటలతో విద్యా బోధన

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసి వాటి ద్వారా చిన్నారులకు ప్రీ ప్రైమరి విద్యనందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకు అనుగుణంగా గోడలకు రంగులతో బొమ్మలు వేయించి పిల్లలను ఆకర్షించేలా కేంద్రాలను తీర్చిదిద్దుతున్నారు. ఇక అమ్మమాట - అంగన్‌వాడీ బాట కార్యక్రమాల ద్వారా గ్రామాల్లోని రెండున్నర ఏళ్ల నుంచి ఆరేళ్లలోపు చిన్నారులను గుర్తించి అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రవేశం కల్పిస్తున్నారు. చిన్నారులకు బయటి ప్రపంచం గుర్తుకు రాకుండా ఆట పాటలతో కూడిన విద్యాబోధన చేయనున్నారు. సృజనాత్మకతను పెంచే రీతిలో కేంద్రాలకు గత సంవత్సరమే ప్లే మెటీరియల్స్ పంపిణీ చేశారు. ఊయల, జారుడు బల్ల వంటి ఆట వస్తువులతో పాటు అక్షరాలు, అంకెలు, బొమ్మలతో కూడిన సామగ్రితో విద్యనందించేలా టీచర్లకు సైతం శిక్షణ ఇచ్చారు. పసి వయస్సులో ఎలాంటి ఒత్తిడి లేకుండా స్నేహపూర్వక వాతావరణం కల్పించడంతో పాటు వారి ఆరోగ్య రక్షణకు పౌష్టికాహారం అందిస్తున్నారు.

17 వరకు ప్రత్యేక కార్యక్రమాలు

జిల్లాలోని అన్ని మండలాల్లో అమ్మ మాట - అంగన్‌వాడీ బాట కార్యక్రమాలు మొదలయ్యాయి. కేంద్రాలను అలంకరించడం మొదలు చిన్నారులను గుర్తించడం, కేంద్రాల్లో చేర్పించడం, సేవల గురించి తల్లిదండ్రులకు వివరించడం తదితర కార్యక్రమాలు ఈ నెల 17 వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్నారు. మొదటి రోజు అంగన్‌వాడీ కేంద్రాలను అలంకరించి తల్లిదండ్రులు, చిన్నారులను కేంద్రాలకు ఆహ్వానించి వారు సెల్ఫీలు తీసుకునేలా ప్రోత్సహించారు. రెండో రోజు గ్రామాలు, పట్టణాల్లో మూడేళ్లలోపు చిన్నారులను గుర్తించి వారి ఇళ్లను సందర్శించడం, తల్లిదండ్రులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రవేశాలు, ప్రీ స్కూల్, పాఠ్యపుస్తకాలు, టైం టేబుల్, కథల పుస్తకాలు, ప్రీ స్కూల్ కిట్, స్కూల్ రెడినెస్ యాక్టివిటీస్, అభివృద్ధి కార్డులు, ప్రగతిపై సమాచారం అందించడం ఒకవైపు అయితే గుర్తించిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించడం, ప్రీ స్కూల్ పూర్తి చేసిన పిల్లలకు సర్టిఫికెట్లు అందించడం, 5 సంవత్సరాలు పైబడిన పిల్లలను ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించడం, 16న పోషణ్ వంటశాల తోటలు అభివృద్ధి చేయడం, టీహెచ్‌ఆర్, హెచ్ సీఎం ద్వారా అందిస్తున్న పోషకాహార పద్ధతులను హైలెట్ చేయడం, పిల్లలందరికీ అనుకూల వాతావరణాన్ని కల్పించడం చేయనున్నారు. 17న సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాల నిర్వహణ, ప్రీ స్కూల్ టైం టేబుల్, పాఠ్యాంశాలు, మంచి అలవాట్లు, విద్య ప్రాముఖ్యతను సాంస్కృతిక కార్యక్రమాల రూపంలో ప్రదర్శన, ప్రీ స్కూల్ పుస్తకాలు, అసెస్మెంట్ కార్డుల ప్రదర్శన, తల్లిదండ్రులు, గ్రామస్థులను అతిథులుగా ఆహ్వానించడం, తల్లిదండ్రులకు బాల్యదిశలో సంరక్షణ, విద్య గురించి ఆలోచన కల్పించడం, పిల్లలు తయారు చేసిన బోధన సామగ్రి, అంగన్‌వాడీ టీచర్, ఐసీడీఎస్ అందించిన మెటీరియల్స్ ప్రదర్శించడం, ఆరోగ్యంగా ఉన్న పిల్లలను నిత్యం ప్రీ స్కూల్‌కు పంపుతున్న తల్లిదండ్రులకు బహుమతులు అందించడం లాంటివి చేయనున్నారు.

ఖరీఫ్ కోసం రైతులు బిజీ బిజీ

● అడపాదడపా కురుస్తున్న వర్షాలు
● సాగుకు సమయాత్తం

నందిపేట, జూన్ 15: మండలంలో అడపా, దడపా కురుస్తున్న వర్షాలకు రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రతీరోజు సాయంత్రం, రాత్రి పూట ఒక మోస్తారు వర్షాలు కురియడంతో రైతులు ఖరీఫ్ పనుల్లో నిమగ్నమైనారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విత్తనాలు విత్తడంలో బిజీబిజీగా ఉన్నారు. కొద్దిపాటి వర్షాలకు పసుపు, సోయా సాగు చేసిన రైతులు ఊరట చెందారు. మరి కొంత మంది రైతులు నారు పోయడం, సోయా,పసుపు, మొక్క జొన్న విత్తడంలో ఉన్నారు. మండలంలోని సుమారు 21వేయి పైచీలుకు ఎకరాల భూమిని సాగుకు యోగ్యం చేశారు.అందులో 19వేల 500 ఎకరాల్లో రైతులు వరి సాగు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. మిగతా ఎకరాల్లో పసుపు, సోయా, కూరగాయలు పండించేందుకు రైతులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ పాటికే సగం తోట భూముల్లో విత్తనాలు పడిపోయాయి. గత రెండు, మూడు సంవత్సరాలు గా పడావుగా ఉన్న భూములనుసైతం రైతులు ఈ సంవత్సరం సాగుకు సిద్ధం చేస్తున్నారు. నందిపేట మండలంలో ప్రైవేట్ కంపెనీల విత్తనాలుకాకుండా ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా పం పిణీ చేసిన జీలుగును ద్రమ్ము చూస్తూ వరి నాట్లు వేస్తున్నారు. అంతే కాకుండా వ్యవసాయ శాఖ ద్వారా క్వాలిటీ సీడ్ పేరుతో వరి విత్తనాలను అలాగే 5కిలోల బరువున్న పెసర్ల సంచిలను రైతులకు ఉచితంగా అందజేశారు. ఇది వరకే మం డలంలోని రైతులు ప్రైవేట్ కంపెనీలు సరఫరా చేసిన వరి విత్తనాలతో నారు పోసేశారు. మండలంలోని తల్వేద, కంఠం, లక్కంపల్లి తదితర గ్రామాల్లో వరి నాట్లు మొదలైనాయి. దేశంలోని బీహార్, కలకత్తా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని వలస కూలీలు మండలానికి వచ్చేశారు. అంతే కాకుండా రాష్ట్రంలోని సూర్యపేట, నల్గొండ జిల్లాల నుంచి వ్యవసాయ కూలీలు రావడానికి ఇక్కడి రైతులు ముందస్తుగా డబ్బులు చెల్లించారు. ఐచర్ వాహనాల కోసం వేచి చూస్తూన్నారు.


మాయాపూర్ శివారులో పసుపు విత్తనాలు వేస్తున్న దృశ్యం


కంఠంలో వరి నాట్లు వేస్తున్న యువకులు

ఘనంగ బోనాల ఊరేగింపు


బోనాల ఊరేగింపులో పాల్గొన్న మహిళలు


పోతరాజుల విన్యాసాలు

కమ్మర్‌పల్లి, జూన్ 15: కమ్మర్‌పల్లి మండల కేంద్రం శివారులోని బీమార్జున ఆలయ ఆరవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ముదిరాజ్ సంఘాల అద్వర్యంలో బోనాల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. గ్రామం లోని ప్రతి ముదిరాజ్ ఇంటి నుంచి మహిళలు తమ బోనాలతో భగత్‌సింగ్ వద్దకు చేరుకుని బోనాలకు ప్రత్యేకపూజలు నిర్వహించి గ్రామ శివారు లోని బిల్కుపై కొలువుదీరిన భీమార్జున ఆలయం వరకు జాతీయ రహదారిగుండా మేళతాళాలు మంగలవాయిద్యాలతో పోతరాజుల విన్యాసాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి స్వామివారికి బోనాలు, నైవేద్యాలు సమర్పించారు. బోనాలను గ్రామ ముదిరాజ్ మహిళలు, ముదిరాజ్ సంఘాల సభ్యులు మేళతాళాలు మంగళ వాయిద్యాలతో గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కమ్మర్‌పల్లి మాజీ ఎం్‌ఎపీ లోలం గౌతమిసుమన్, మాజీ ఎంపీటీసీ కొత్తపల్లి హరికఅశోక్, గణేష్, తలయకమిటీ సభ్యులు ఇందూర్ రాజేందర్,నాగార్జున్, గంగసాయిలు, భానూచెందర్, ఎం. రాజేశ్వర్, కొత్తపల్లి అశోక్, గంగాధర్,నవీన్,శివ, సురేష్, ఆకుల దేవదాస్, గ్రామస్తులు సాగర్, మురళి, బాజన్న, బాలకృష్ణ, దుర్గయ్య, సార్‌గల రమేష్, సభ్యులు మహిళలు పాల్గొన్నారు.


బోధన్‌లో....

బోధన్‌రూరల్ : బోధన్ పట్టణంలోని ధ్యాకం గల్లీ కాలనీవాసులు మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బోనాల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్నూరు మహిళలు బోనాలతో మహాలక్ష్మి ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అమ్మవారికి ఓడిబియ్యాన్ని నింపి మొక్కులు తీర్చుకున్నారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్నూరు కాపు కుల సంఘ ప్రతినిధులు, కులసంఘ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని నాళేశ్వర్‌లో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలతో పాటు పురుషులు తలపై బోనాలను ఎత్తుకుని స్థానిక మహాలక్ష్మి ఆలయానికి తరలివెళ్లారు. ఊరేగింపులో పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, యువతి, యువకుల నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. పాడిపంటలు చల్లగా ఉండాలని కోరుతూ గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పెద్ద సాయన్న, కిషన్, బాగాజీ లక్ష్మణ్, గంగాధర్, రాకేష్, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.


నాళేశ్వర్‌లో బోనాలతో గ్రామస్థులు


నాళేశ్వర్‌లో జరిగిన బోనాల ఉత్సవాలలో పాల్గొన్న గ్రామస్థులు

నీట్‌లో పెర్కిట్ విద్యార్థిని ప్రతిభ


బచ్చెవల్ శ్రేష్ఠ

ఆర్మూర్ రూరల్, జూన్15 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వెల్లడైన నీట్ పరీక్ష ఫలితాల్లో ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌కి చెందిన బచ్చెవాల్ శ్రేష్ఠ ఆల్ఇండియా స్థాయిలో 1978 ర్యాంక్ సాధించారు. ఓబీసీ కేటగిరిలో 654ర్యాంకు వచ్చింది. బచ్చెవాల్ గంగమోహన్ రేఖ దంపతుల కూతురు శ్రేష్ఠ చిన్ననాటి నుంచి చదువులో చురుకుగా ఉండేది. తండ్రి గంగమోహన్ మంచిర్యాల్ జిల్లా బీమిని మండల ఎంపీడీవోగా పనిచేస్తున్నారు. భవిష్యత్తులో న్యూరో సర్జర్ కావాలని శ్రేష్ఠ తన ఆకాంక్షను వెల్లడించింది.

కోటగిరి వాసి..


విద్యార్థిని బీర్కూర్ సంజన

కోటగిరి,జూన్15(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండల కేంద్రానికి చెందిన బీర్కూర్ సంజన నీట్‌లో ఆలిండియా 3161ర్యాంకును సాధించింది. రాష్ట్ర బీసీ కేటగిరిలో 1132వ ర్యాంకు సాధించింది. కోటగిరి మాజీ సర్పంచ్ బీర్కూర్ గంగాధర్ మనవరాలు సంజన హైదరాబాద్‌లోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసింది. నీట్‌లో ఆలిండియా ర్యాంకు సాధించడం పట్ల కోటగిరి గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం


కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

బోధన్‌రూరల్,జూన్15(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. స్వామివారి కల్యాణ నక్షత్రం శ్రావణ నక్షత్రం సందర్భంగా ప్రతినెల మాస కల్యాణం నిర్వహిస్తారని ఆలయ కమిటీ నిర్వాహకులు మురళి తెలిపారు. ఆదివారం స్వామివారి మాసకల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణ మహోత్సవంలో భాగంగా విశ్వక్సేరాధన, సుదర్శన పూజ, వాసుదేవ పుణ్యవచనం, శ్రీహరి కంకణ ధరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య వస్త్ర సమర్పణ, కన్యాదానం, మంగళ పూజ, మంగళధారణ తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు మాట్లాడుతూ కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి అన్నారు. కార్యక్రమంలో భక్తులు,ఆలయ కమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

'రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సైనికుల్లా పనిచేయాలి'

మెండోర, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు సైనికుల్లా పనిచేసి పార్టీ అభ్యర్థుల గెలుపుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి అన్నారు. ఆదివారం మెండోర, కోడిచర్ల, చాకిర్యాల్, దూదిగాం గ్రామాల్లో ప్రజలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజా ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలని సూచించారు. గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాకులు కలిసి మెలిసి ఉండి పార్టీ అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండోజీ రవి, కొప్పెల మోహన్, దేవరాజ్, ప్రమోద్, గంగాధర్, శ్రీనివాస్, రాజన్న, రంజిత్, రవి, మురళి, దేవన్న తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న ఏఎంసీ చైర్మన్, పార్టీ నాయకులు

పడిగెలలో గ్రామదేవతలకు జలాభిషేకం


ఊరేగింపుగా వెళ్తున్న సభ్యులు

వేల్పూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడిగెల గ్రామంలో ఆదివారం గ్రామ దేవతలకు గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గంగనీళ్లతో జలాభిషేకం నిర్వహించారు. అంతకు ముందు గ్రామంలోని రామాలయం నుంచి గంగనీళ్ల వలగొడుగుతో డప్పు వాయిద్యాల మధ్య గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా నిర్వహిస్తు పవిత్రమైన గంగజలాలను బ్రహ్మంగారి ఆలయం, గంగమ్మతల్లి, పోచమ్మ, ఐదుచేతుల పోచమ్మ, ముత్యా లమ గంగజలాలతో జలాభిషేకం నిర్వహించారు. ఆయా ఆలయాల చుట్టు గంగనీళ్లతో ఐదుసార్లు ప్రదక్షణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ గ్రామంలోని పాడిపంటలు బాగా పండి ప్రజలందరు సుఖశాంతులో ఉండాలని గ్రామదేవతలకు మొక్కుకు న్నారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా దేవేందర్


నియామక పత్రాన్ని అందజేస్తున్న పసుపు బోర్డు చైర్మన్

కమ్మర్‌పల్లి, జూన్ 15: భారతీయ జనతాపార్టీ కమ్మర్‌పపల్లి మండల ఎస్సీ మోర్చా నూతన అధ్యక్షుడిగా చౌట్‌పల్లి గ్రామానికి చెందిన చిట్యాల దేవేందర్‌ను నియమించారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యలయంలో బాల్కొండ నియోజిక వర్గ ఇన్‌చార్జ్ మల్లికార్జున్ రెడ్డి నాయకత్వంలో దేవేందర్‌కు జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి నియమక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కమ్మర్‌పల్లి మండల పార్టీ అధ్యక్షుడు బద్దం రమేష్ రెడ్డి, జిల్లా బీజేపీ నాయకులు ఉన్నారు.

కోనాసమందర్‌లో వీడీసీ నూతన కార్యవర్గం


వీడీసీ నూతన పాలకవర్గ సభ్యులు

కమ్మర్‌పల్లి, జూన్ 15: మండలంలోని కోనాసమందర్ గ్రామాభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దేవాలయంలో కులసంఘాల సభ్యులు సమావేశమై నూతన పాలకవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. వీడీసీ నూతన అధ్యక్షుడిగా మెలగంగాధర్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా శెట్టిపల్లి గంగాధర్, కోశాధికారిగా కంతి గంగాధర్, సలహాదారులుగా సామ బాపురెడ్డి, కలేరు రాజేశ్వర్, చెలిమెట గంగాధర్, మరో 15 మంది సభ్యులుగా నూతర పాలకవర్గం ఎన్నుకున్నారు.

సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న ఏఎంసీ డైరెక్టర్

నందిపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలో ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో వికలాంగులు క్షీరాభిషేకం చేశారు. వికలాంగుల వివాహ ఖర్చు రూ.50 నుంచి రూ.లక్ష వరకు పెంచడంతో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ఆర్మూర్ ఇన్‌చార్జి వినయ్ కుమార్‌రెడ్డి చిత్రపటాలకు నిజామాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెంట ఇంద్రుడు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్ క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు దమ్మాయి శ్రీను, మాన్సూర్ భూమేష్, ఎడ్డిగారి నిఖిల్, వికలాంగుల సంఘం మండల అధ్యక్షులు ఎస్.లక్ష్మి, సభ్యులు కలీం, సాగర్, పెద్దకాపు ముత్యం, సుదర్శన్, సాయమ్మ, భారతీ తదితరులు ఉన్నారు.

కమ్మర్‌పల్లిలో ఉచిత వైద్యశిబిరం


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కమ్మర్‌పల్లి, జూన్ 15: మండల కేంద్రంలో తెలంగాణ ప్రాంతీయ ఉపాధ్యాయసంఘం (తపస్) ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పిల్లల ఉచిత వైద్యశిబిరానికి అనూహ్య స్పందన లభించింది. పిల్లల వైద్యనిపుణులు డాక్టర్ చిలుక చైతన్య ఈ వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి తల్లిదండ్రులు తమ పిల్లలతో వచ్చి వివిధ రకాల వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో తపస్ రాష్ట్ర, జిల్లా బాధ్యులు రామకృష్ణ, కిషన్ రెడ్డి, కమ్మర్‌పల్లిమార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, చిలుక బలరాం, ఉపాధ్యాయులు రుద్ర మధు, లక్ష్మీనర్సయ్య, మండల తపస్ అధ్యక్షులు సల్లూరి కిషన్ గౌడ్, కార్యదర్శి రమేష్, సభ్యులు పాల్గొన్నారు.

కల్దుర్కిలో బీరప్ప ఆలయానికి భూమిపూజ


ఆలయానికి భూమిపూజ నిర్వహిస్తున్న భక్తులు

బోధన్‌రూరల్,జూన్15(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని కల్దుర్కి గ్రామంలో కుర్మ సంఘం ఆధ్వర్యంలో బీరప్ప మందిరాన్ని నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆలయ శిఖరానికి నవధాన్యాలతో పూజ కార్యక్రమం నిర్వహించారు. కుల సంఘ మహిళలు మంగళహారతులతో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరు ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కుర్మ సంఘం అధ్యక్షులు సిరిగిరి రాం, కార్యదర్శి గౌరుగొండ, అశోక్, సభ్యులు నాగగొండ, శ్రీనివాస్, సాయిగొండ, శ్రీనుగొండ పాల్గొన్నారు.

శ్రీనాగలింగేశ్వర ఆలయ ఆవరణలో శ్రమదానం


ఆలయ ఆవరణలో శ్రమదానం చేస్తున్న సంస్థ సభ్యులు

ఆర్మూర్ రూరల్ , జూన్15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనాగలింగేశ్వర ఆలయంలో ఆదివారం మహాత్మస్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణ పరిసరాల్లో ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్, ఆలయ కమిటి సభ్యులు డివిఎస్ చక్రవర్తి, సత్యశ్రీనివాస్, సంస్థ సభ్యులు ప్రశాంత్, సుంకె నిశాంత్, రాజ్‌కుమార్, అరుణ్‌కుమార్, నరేష్, గణేష్, కొత్తూరు రాజయ్య, బాలాజీ, బోజన్న, తదితరులు పాల్గొన్నారు.

మెండోరలో పస్కరాజుల పండుగ


పూజలు చేస్తున్న ముదిరాజ్ కులస్థులు

మెండోర, జూన్15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పస్కరాజుల పండగను ముదిరాజ్ కులస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ కులస్తులు ఖరీఫ్ సీజన్లో మొదటగా పస్కారాజుల పండగ చేసిన తర్వాతే గ్రామంలో ఉన్న దేవతల పండగలు గ్రామస్తులు నిర్వహిస్తారు. ముదిరాజ్ కులస్తులు జీవనాధారం పండ్ల పెంపకంతో జీవనం సాగిస్తుండటంతో నాటి రాజులు ముదరిఆజ్ కులస్థులే గ్రామంలో ఉన్న దేవతలకు పండ్లను సమర్పించే ఆనవాయితీ తీసుకువచ్చారు. అందులో భాగంగా ముదిరాజ్ కులస్తులు గ్రామంలో ఉన్న పస్కారాజులకు నైవేద్యం సమర్పించి భక్తి శ్రద్ధలతో మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి


మృతిచెందిన గేదె

ఏర్గట్ల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన మణిమానిక్యం శ్రీనివాస్‌కు చెందిన గేదె ఆదివారం విద్యుత్ ఘాతుకంతో మృతిచెందింది. స్థానిక పశు వైద్యాధికారిణి రాజ్యలక్ష్మీ తెలిపిన వివరాల ప్రకారం గ్రామశివారులో మేతకు వెళ్ళిన గేదె ప్రక్కన ఉన్న విద్యుత్ కరెంట్ తీగలు తెగి పైన పడటంతో మృతి చెందినట్లు ఆమె తెలిపారు. సుమారు 80 వేల నష్టం జరిగిందన్నారు.

బాధితుడిని పరామర్శించిన ఆర్మూర్ ఎమ్మెల్యే


బాధితుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

ఆర్మూర్ టౌన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని హాస్పిటల్‌లో ఆదివారం మోర్తాడ్‌కు చెందిన రొయ్యల సురేష్‌ను ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి పరామర్శించారు. ఇటీవల ఒక వర్గం వారు దాడిచేసిన ఘటనలో సురేష్ తీవ్రంగా గాయపడ్డాడు. దాడి జరిగిన బాధితుడిని, ఆయన కుటుంబసభ్యులను వివరాలు అడిగి తెలుసు కున్నారు. అనంతరం మోర్తాడ్ ఎస్సైతో ఫోన్‌లో మాట్లాడారు. పోలీస్ లు ప్రవర్తిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘట నపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఎమ్మెల్యే వెంట బీజేపీ సీనియర్ నాయకులు కంచెట్టి గంగాధర్, పట్టణ అధ్యక్షుడు మందుల బాలు, ద్యాగ ఉదయ్ పాల్గొన్నారు.

నేడు అర్గుల్‌లో రైతు నేస్తం ప్రారంభం

జక్రాన్‌పల్లి, జూన్15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్గుల్ గ్రామంలో రైతు వేదికలో సోమవారం రైతునేస్తం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వ్యవసాయాధికారిణి దేవిక తెలిపారు. జక్రాన్‌పల్లి, అర్గుల్, కలిగోట్ రైతువేదికలకు నూతనంగా రైతునేస్తం కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లు మంజూరయ్యాయని ఆమె తెలిపారు. రైతులకు నేరుగా వ్యవసాయానికి సంబంధించిన సల హాలు, సూచనలు ఇవ్వడానికి ప్రత్యక్ష ప్రచారం ద్వారా రైతులు వీక్షించి వారి సందేహాలు నివృత్తి చేసుకోవడానికి రైతు వేదికలకు వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానం చేశారన్నారు.

'విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి'


ఆర్థిక సహాయం అందజేస్తున్న సభ్యులు

కోటగిరి,జూన్15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన నిఖిత అనే విద్యార్థిని గురుకుల పాఠశాలలో చదివి ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. నిఖితకు ములుగు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధించింది. ఆర్థికస్తోమత లేని కారణంగా ఆమె చదువు మధ్యలో ఆగిపోకుండా ఉండేందుకు కోనేరు చారిటబుల్ ట్రస్టును సంప్రదించారు. ఆదివారం ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ విద్యార్థిని నిఖితను అభినందించడంతో పాటు చదువుల కొరకు 20వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో కోనేరు తరుణ్ సాయితేజ, బీజేపీ నాయకులు నవీన్, మోహన్ రావు, పాకల సాయిలున్నారు.

'బాధిత కుటుంబానికి అండగా ఉంటాం'

మండలంలోని ఎత్తొండ గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు శ్యామ్ సోదరుడు రాజు అనారోగ్యంతో మృతిచెందారు. ఆదివారం కుటుంబాన్ని బీజేపీ నాయకులు, ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహయం అందజేశారు. రాజు కుమారైను కోనేరు ట్రస్టు తరఫున ఉన్నత చదువులు చదివించి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ అధ్యక్షులు నవీన్, ప్రధాన కార్యదర్శి విలాస్, జగదీష్, శివరాం కార్తీక్, వెంకటేష్ పాల్గొన్నారు.

రుద్రూరు: బాన్సువాడ నియోజకవర్గం రుద్రూర్ మండలంలోని రాయకూర్ గ్రామానికి చెందిన బేగరి సాయికుమార్ బాన్సువాడ శశాంక్ కళాశాలలో ఎంఎస్‌డబ్ల్యూ చదువుతున్నారు. తన చదువు కోసం ట్రస్ట్‌ను ఆశ్రయించగా కోనేరు చారిటబుల్ ట్రస్టు తరఫున 10 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని కోనేరు తరుణ్ సాయితేజ విద్యార్థి సాయి కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో బాన్సువాడ నియోజకవర్గ బీజేపీ నాయకులు, ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్, మండల బీజేపీ అధ్యక్షులు అలపాటి హరికృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

జొన్నల డబ్బుల కోసం

రైతుల ఎదురుచూపులు

- 162 మంది రైతులు
- 3 వేల క్వింటాళ్ల జొన్నలు విక్రయం
- ఆందోళనలో రైతులు



పర్మల్లలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు (ఫైల్)

లింగంపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలో జొన్నలు విక్రయించిన రైతులు నెల రోజులుగా డబ్బుల కోసం ఎదురుచూస్తున్నారు. మండలంలోని పర్మల్ల, శెట్పల్లి, రాంపల్లి, బోనాల్ గ్రామాలతో పా టు పలు గ్రామాల్లో జొన్న పంటను అధికంగా సాగు చేశారు. ప్రభుత్వం లింగంపేట సహకార సంఘం ద్వారా జొన్నలను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసింది. కాని జొన్న కొనుగోలు కేంద్రంలో పంటను అమ్మి నెల రోజులు దాటిన రైతులకు ఇప్పటికి డబ్బులు వారి ఖాతాలో జమ కాలేదు. దీంతో తదుపరి పంటకు పెట్టుబడి లేక రైతెలె తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో మొత్తం 3 వేల క్వింటాళ్ల జొన్నలను 162మంది రైతుల నుంచి లింగంపేట సహకార సంఘం ద్వారా కొనుగోలు చేశారు. సాధారణంగా పంట విక్రయించిన కొద్ది రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయి. ఈ సారి జొన్నలు విక్రయించి నెల రోజులు దాటినా డబ్బులు ఖాతాలో జమ కావకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఖరీఫ్ సాగు కోసం విత్తనాల కోసం అప్పులు సైతం ఇవ్వడం లేదని రైతు ఆవేదన చెందుతున్నారు.

ఆందోళనలో రైతులు

పెట్టుబడి డబ్బులు లేకపోతే తదుపరి సాగు పనులు ప్రారంభించలేమని, ఇది తమ జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతుందని వారు అంటున్నారు. సంబంధిత అధికారులు ఈ విషయంపై వెంటనే స్పందించి, రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా తక్షణచర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ పరిస్థితిపై అధికారులు తక్షణమే స్పందించి, రైతుల కష్టాలను తీరుస్తారని మండల రైతులు ఆశిస్తున్నారు.

ఖరీఫ్‌కు డబ్బులు లేక ఇబ్బందిగా ఉంది..

- గంగారెడ్డి, రైతు, పర్మల్ల



నెల రోజుల క్రితం పర్మల్ల గ్రామంలోని జొన్న కొనుగోలు కేంద్రంలో నా పంటను విక్రయించాను. మొత్తం 6ఎకరాలలో సాగు చేశాను. 62క్వింటాళ్ల జొన్నలు పండిం చాను, దిగుబడి బాగానే వచ్చింది. కాని ఇప్పటి వరకు నా అకౌంట్‌లో డబ్బులు జమ కాలేదు. తదుపరి పంటకు పెట్టుబడి పెట్టడానికి చాలా కష్టంగా ఉంది. మాలాంటి చిన్న, మధ్యతరహా రైతులకు ఈ డబ్బులు చాలా కీలకం. అప్పులు చేసి పంట వేసుకున్నాం. అధికారులు దయచేసి స్పందించి వెంటనే రైతులకు డబ్బులు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

నెల దాటినా డబ్బులు రాలేదు..

కొడబోయిన శ్రీనివాస్, రైతు, పర్మల్ల



3 ఎకరాలలో జొన్న పంట సాగు చేశాను. 30 క్వింటాళ్ల జొన్నలు పండించాను పర్మల్ల కొనుగోలు కేంద్రంలో జొన్నలను విక్రయించాను. విక్రయించి నెల దాటింది. ధాన్యం డబ్బులు వారం రోజులలోపు వేసిన ప్రభుత్వం జొన్న రైతులపై ఎందుకు చిన్న చూపు చూస్తుందో రూ.లక్ష వర కు వస్తాయి. కొన్ని అప్పులు పోను ఖరీఫ్ సాగుకు ఉపయోగపడ తాయని ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నాను. ఈ నెల 10 వరకు వేస్తారని అధికారులు చెప్పారు. కాని ఇప్పటి వర కు నా అకౌంట్‌లో డబ్బులు జమ కాలేదు. అధికారులు స్పందించి వెంటనే డబ్బులు జమ చేయాలని కోరుతున్నాను.

తగ్గుతున్న చిన్నారుల కంటి చూపు

● పోషకాహారం, శారీరక శ్రమ లేకపోవడం ● టీవీలు, స్మార్ట్‌ఫోన్ వాడకం మరో కారణం

పెద్దకొడప్‌గల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సర్వేంద్రియానాం నయనం ప్రధానం అన్నారు పెద్దలు. మానవునికి ఉన్న అవయవాల్లో అన్నింటి కంటే కండ్లు అతి ముఖ్యమైనవి. ఆ కండ్లే లేకుంటే మనిషి జీవితమే అంధకారంగా మారుతుంది. అంత ప్రాధాన్యత ఉన్న కండ్లు చిన్నారులలో మెల్ల మెల్లగా సమస్యగా మారి వారి పాలిట ఇబ్బందిగా మారు తున్నాయి. గతంతో పోల్చి చూస్తే చిన్నారులలో కంటి సమస్యలు అధికంగా పెరుగుతున్నాయి. ఈ మధ్య కాలంలో విద్యార్థులకు నిర్వహించిన కంటి పరీక్షలలో 100కు 10 మంది చిన్నారులకు పైగా సమస్యలతో బాధపడుతుండటం గుర్తించారు. ఈ విధంగా కంటి సమస్యలు పెరుగు కుంటూ పోతే రానున్న రోజుల్లో చిన్నారులు ఇబ్బంది పడే పరిస్థితులు వస్తాయని హెచ్చరిస్తున్నారు కంటి వైద్యులు.



కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న దృశ్యం (ఫైల్)

ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్షలు..

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆయా జిల్లాలలో ఆర్‌బిఎస్‌కే(రాష్ట్రీయ బాల స్వస్థత కార్యక్రమం) ఆధ్వర్యంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో చిన్నారులకు క్రమం తప్పకుండ ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా ప్రతీ నెల వైద్య సిబ్బంది ఆయా గ్రామాలలో గల పాఠశాలల ను ఎంచుకుని ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ పరీక్షలలో భాగంగా కంటి, గుండె, నరాలకు సంబంధించిన సమస్యలతో పాటు ఇతర పరీక్షలు నిర్వహిస్తారు. ఫేజ్ 1 కింద 8నుండి 10 తరగతులకు సంబంధించిన విద్యార్థులకు, ఫేజ్ 2 కింద 5 నుంచి 8తరగతుల విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తారు. గత సంవత్సరం జుక్కల్ నియోజక వర్గంలోని ఆయా గ్రామాల పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా చాలా మంది చిన్నారులకు కంటి సమస్యలు బయట పడ్డాయి. సరాసరిగా తీసుకుంటే 100 మంది విద్యార్థులలో కంటి సమస్యలతో బాధ పడుతున్న వారిని గుర్తించారు. వీరిలో చాలా మందికి మందులు పంపిణీ చేయగా, కంటి సమస్యలు అధికంగా ఉన్న వారికి అద్దాలు పం పిణీ చేశారు. అయితే పంపిణీ చేసిన ఈ అద్దాలను చాలా మంది చిన్నారులు ధరించాలంటే సిగ్గు పడుతుండటంతో సమస్య మరింత పెరు గుతుందని కంటి వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యాభ్యాసం చేసే వారిలో కంటి సమస్యలు అధికంగా ఉన్నట్లు గుర్తిస్తున్నారు కంటి వైద్యులు.

విటమిన్ ఏ లోపం, శారీరక శ్రమ లేకపోవడం..

ప్రధానంగా కంటి సమస్యలు మిటమిన్ ఏ లోపంతో రావడం ఒక కారణమైతే, పోషకాహారం, శారీరక శ్రమ లేకపోవడం మరో కారణమంటున్నారు కంటి వైద్య నిపుణులు. వసతి గృహాలలో ఉండే విద్యార్థులకు సరియైన సూర్యరశ్మి అందకపోవడం, పోషకాహార లోపంతో ఈ సమస్య మరింత అధికంగా మారుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. గతంలో ఏ పాఠశాలలో చూసిన సాయంత్రం సమయంలో తప్పనిసరిగా విద్యార్థులకు ఆటలు ఆడించేవారు. అయితే రాను రాను విద్యార్థులలో చదువు పై పోటీతత్వం పెరగడంతో ఆటల వైపు కన్నెత్తి చూడటం మానేశారు. దీంతో విద్యార్థులకు శారీరకంగా శ్రమ లేకపోవడంతో ఊబకాయులుగా మారుతున్నారు. అంతేగాక ఇక ఇంటి వద్ద ఉండే విద్యార్థులు పాఠశాల నుండి రాగానే ఫోన్‌కు బానిసలుగా మారడం, సరియైన నిద్ర లేక పోవడం, ఒత్తిడి వంటి సమస్యలతో కంటి చూపు తగ్గిపోవడం కారణం గా మారుతుంది.

కంటి చూపు తగ్గకుండా ఉండాలంటే ఏం చేయాలి..

కంటి చూపు పెరగాలంటే ప్రధానంగా ఆకుకూరలు వినియోగించడంతో పాటు, క్యారట్, బొప్పాయి, చేపలు, గుడ్లు, పాలు తీసుకోవాలి. సెల్ ఫోన్, టివి చూడటం తగ్గించాలి. సెల్‌ఫోన్‌ను అదే పనిగా చూడటం వలన కంటిలోని రెటినా మాకుల దెబ్బతిని దూరం చూపు తగ్గిపోతుందని హెచ్చరిస్తున్నారు కంటి వైద్యులు. దీంతో పాటుగానే చిన్నారులు పడు కునే ముందు కనీసం 2 గంటలు టివి చూడవద్దని, టివిని 4 గజాల దూరంలో ఉండి చూడాలని సలహా ఇస్తున్నారు. మనిషి నిమిషానికి కం టి రెప్పలను 30 సార్లు అదిలించాలని, టివిలు, ఫోన్లు, ల్యాప్‌టాప్‌ను వినియోగించే వారు ప్రతీ అరగంటకోసారి లేచి నడవడంతో పాటు దూరం చూస్తే కంటి రెప్పలను ఆడించాలని సూచిస్తున్నారు కంటి వైద్యులు.

ఆర్‌బీఎస్‌కే ద్వారా పరీక్షలు

అర్జున్, వైద్యుడు



గత సంవత్సరం మేము ఆర్‌బీఎస్కే ద్వారా ఆయా పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించాం. ఇందులో భాగంగానే కంటి పరీక్షలలో భాగంగా చిన్నారులకు కంటి పరీక్షలు నిర్వహించగా ప్రతీ 100లో 10 మందికి కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించాం. కొన్ని పాఠశాలల్లో అయితే ఈ సమస్య ఇంకా కొంచెం అధికంగా ఉంటుంది. గతసారి కంటి సమస్యలతో బాధ పడేవారిని గుర్తించి లయన్స్ సహకారంతో కంటి అద్దాలు పంపిణీ చేశాం. అయితే వీటిని విద్యార్థులు తప్పనిసరిగా ధరించాలి. కొంత మంది నామోషిగా భావించి అద్దాలు వాడటం లేదు. దీంతో కంటి సమస్యలు మరింత పెరుగుతాయి. ఇక విద్యార్థులు కూడా శారీరకంగా ఆటలు ఆడటంతో పాటు, ఫోన్లు, టీవీల వినియోగం తగ్గించాలి. దీంతో పాటుగానే ప్రతీరోజు కనీసం అరగంట పాటయిన సూర్యరశ్మి తగిలేలా చూసుకోవాలి.

సొంతింటి కల సాకారమయ్యేదెన్నడో..?!

- పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు
- లబ్ధిదారుల ఎదురుచూపు



డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు

ఆర్మూర్‌రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం బడుగు, బలహీనవర్గాల ప్రజలకు సొంతింటి సౌకర్యం కల్పించాలని రెండు పడక గదుల ఇళ్లను నిర్మించి ఇస్తామని వాగ్దానం చేసింది. అప్పటి సీఎం కేసీఆర్ అర్హులైన వారం దరికి డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. అనేక గ్రామాల్లో డబుల్ బెడ్‌రూంల ఇళ్ల నిర్మాణాలకు నోచుకోలేదు. ఆర్మూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల్లో సుమారు రెండు వేలకు పైగా డబుల్ బెడ్ రూం ఇళ్ళను మంజూరు చేస్తు న్నట్లు ప్రకటించారు. నందిపేట, మాక్లూర్ మండలాల్లో డబుల్ బెడ్‌రూంల నిర్మా ణాలను ప్రారంభించలేదు.

మూడు గ్రామాల్లోనే..

ఆర్మూర్ మండలంలోని మూడు గ్రామాల్లోనే రెండు పడక గదుల నిర్మాణాలను ప్రారంభించారు. ఆర్మూర్ పట్టణంతో పాటు పెర్కిట్, అంకాపూర్ గ్రామాలలో డబుల్ బెడ్‌రూంల ఇళ్ళ నిర్మాణాలను ప్రారంభించారు. ఆర్మూర్ పట్టణంలో 160రెండు పడక గదుల నిర్మాణాలకు శ్రీకారం చుట్టగా, అందులో 136ఇళ్లు దాదాపు పూర్తి కావొచ్చింది. కొంత మేరకు మౌళిక వసతులు కల్పించాల్సి ఉంది. ఇంటర్నల్ రోడ్లు, విద్యుత్ సౌకర్యం, సీసీరోడ్లు, ఇతర మౌలిక వసతులు పూర్తి చేయాల్సి ఉంది. అంకాపూర్ గ్రా మంలో 165ఇళ్లు నిర్మించాలని సంకల్పించి పనులు ప్రారంభించగా 112ఇళ్లు వివిధ ధశల్లో ఉన్నాయి. ఇక్కడ సీసీరోడ్లు నిర్మించి డ్రైనేజీ పనులు చేపడుతున్నారు. పెర్కిట్ లో వంద ఇళ్ల నిర్మాణం ప్రారంభించగా ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యి చిన్నపాటి పనులు పూర్తి చేయాల్సి ఉంది.

అర్హులైన వారికే ఇళ్ల మంజూరు..

ఆర్మూర్ పట్టణంతో పాటు అంకాపూర్, పెర్కిట్ గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న రెండు పడక గదుల ఇళ్ళను అర్హులైన వారికే అందజేయాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి పట్టుదలతో ఉన్నారు. నిర్మాణంలో ఉన్న రెండు పడక గదుల ఇళ్ళను ఇటీవల పరిశీలించిన ఎమ్మెల్యే రాజకీయాలకు అతీతంగా నిజమైన లబ్ధిదారులకే ఇళ్లు కేటాయించాలని అధికారులకు సూచించారు. గ్రామ సభలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేసి పారదర్శకంగా ఇళ్ళు కేటాయించాలని అధికారులను ఆదేశించారు. దీంతో డబుల్ బెడ్‌రూం నిజమైన లబ్ధిదారులకే అందుతాయని ప్రజలు విశ్వసిస్తున్నారు.

దరఖాస్తు చేసుకున్న వారి ఎదురుచూపులు..

ఆర్మూర్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఏళ్ళ తరబడి ఎదురుచూస్తున్నారు. వారికి సొంతింటి కల ఎప్పుడు నెరవేరుతుందోనని ఆశతో ఉన్నారు. రేండేళ్ల క్రితం డబుల్‌బెడ్‌రూంల మంజూరుకు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు, నాయకులు సూచించడంతో గ్రా మా ల్లో లబ్ధిదారులు అధిక సంఖ్యలో డబుల్ బెడ్‌రూంలకు దరఖాస్తు చేసుకున్నారు. ని యోజక వర్గంలోని మూడు గ్రామాల్లోనే పనులు ప్రారంభించినప్పటికీ సొంతింటి కల నేరవేరుతుందన్న ఆశతో ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభు త్వం అధికారం చేపట్టింది. ఎన్నికల మెనిఫెస్టోలో అర్హులైన పేదలకు ఇంటి నిర్మా ణాలకు రూ.5 లక్షలు అందజేస్తామని హామీ ఇచ్చింది. ఇందిరమ్మ ఇళ్ల పేరిట ఇళ్లు లేని వారికి ఇంటి స్థలంతో పాటు రూ.5లక్షలు ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు.. దీంతో రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలు కొత్తవి ప్రారంభించేందుకు ఆస్కారం లేదు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఇళ్లనే లబ్ధిదారులకు కేటాయించాల్సి ఉంటుంది. ప్రస్తుత ప్రభుత్వం సొంత స్థలం ఉన్నవారికి ఇళ్లు నిర్మించుకోవడానికి రూ.5లక్షలు అందజేయనున్న దృష్ట్యా ఇంటి స్థలం ఉన్నవారు దరఖాస్తులు చేసుకోగా గ్రామాల్లో చాలామంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరయ్యాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇళ్లు నిర్మిస్తే లబ్ధిదారులకు దశలవారీగా రూ. 5లక్షలు అందజేయనున్నారు. కొత్త ప్రభుత్వంలోనైనా తమ సొంతింటి కల సాకారానికి మోక్షం లభిస్తుందని లబ్ధిదారులు ఆశాభావంతో ఉన్నారు.

స్నాతకోత్సవం లోగా..

బాలికల హాస్టల్‌కు శంకుస్థాపన జరిగేనా?

● జూలైలో టీయూ స్నాతకోత్సవం ● గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరయ్యే అవకాశం

డిచ్‌పల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అవతరణకు ముందే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం పేరుతో ఉన్న ఏకైక యూనివర్సిటీ డిచ్‌పల్లి తెలంగాణ యూనివర్సిటీ. ఇంత ఘనమైన పేరున్న ఈ విశ్వవిద్యాలయంలో బాలికలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. రాష్ట్రం అవతరించి 11ఏళ్లు గడిచినా వర్సిటీలో బాలికల వసతి సమస్య నేటికి తీరడం లేదు ఎన్నో సార్లు ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు, రాష్ట్ర గవర్నర్‌కు వినతి పత్రాలు విద్యార్థులు అందించిన సమస్య పరిష్కారం కావడం లేదు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి విద్యార్థి నులు ఇక్క డికి పీజీ, ఉన్నత చదువుల కోసం వస్తుంటారు. 8 ఏళ్ల కాలంగా ఈ హాస్టల్ సమస్య తీవ్రంగా వేధిస్తున్న ప్రభుత్వ, పెద్దలు, ఉన్నత విద్యా మండలి స్పందించకపోవడంతో విద్యార్థినులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. పీజీ కోర్సుల్లో అన్ని విభాగాల్లో విద్యార్థినులే అధిక శాతం సీట్లు పొందగా 100శాతం సీట్లలో 72మంది విద్యార్థినులే సీట్లు సాధిస్తున్నారని వర్సిటీ అధికారులే చెబుతున్నారు. వర్సిటీలోని బాలికల హస్టల్ లోని ఒక్కో గదిలో 5నుంచి 6గురు ఉండాల్సి ఉండగా 10 నుంచి 15 మంది సర్దుబాటు చేసుకుం టున్నారు. తెలంగాణ యూనివర్సిటీలో 1851 మంది విద్యార్థులు పీజీ కోర్సుల్లో చేరగా అందులో 1226మంది బాలికలు పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందారు. గతంలో ఏన్నడు లేని విధంగా పీజీ కోర్సుల్లో బాలికలు ఎక్కువగా చేరుతుండటంతో హస్టల్ అకామిడేషన్ ఇబ్బందిగా మారుతుంది. దీంతో యూనివర్సిటీ అధికారులు సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల్లో చేరే విద్యార్థులకు హస్టల్ వసతి కల్పించకుండా ఒత్తిడిని తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. పదేళ్ల క్రితం 300 మంది కోసం నిర్మించిన బాలికల హాస్టల్‌లో ప్రస్తుతం 500 మంది ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కెమిస్ట్రీ, తెలుగు, ఇతర డిపార్టుమెంట్‌లలో 30 నుంచి 60 సీట్లకు పెంచిన హాస్టల్ వసతి మాత్రం పెంచడం లేదని దీంతో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని విద్యార్థినులు వాపోతున్నారు. గతంలో విశ్వ విద్యాలయానికి గవర్నర్ హోదాలో తమిళిసై సౌందర రాజన్ సందర్శించి సమయంలో విద్యార్థులు బాలికల హాస్టల్ ఏర్పాటు చేయాలని ఆమెకు తమ గోడు వెళ్లబోసుకున్నారు. వెంటనే సమస్య పరిష్కరించేందుకు స్వయంగా హాస్టల్ సందర్శించిన గవర్నర్ హామీ ఇచ్చి రెండు ఏళ్లు గడిచినా ఇంత వరకు హస్టల్ వసతి నిర్మాణానికి ముందడుగు పడక పోవడంతో విద్యార్థినులకు సమస్యలు అధికమయ్యాయి. కావున ఇప్పటికైనా జిల్లా శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు, పార్ల మెంట్ సభ్యుడు వసతి గృహం ఏర్పాటు పట్ల ప్రత్యేక చొరవ చూపా లని విద్యార్థినులు కోరుతున్నారు.



టీయూ స్వాగత తోరణం



టీయూ బాలికల హాస్టల్ ఇదే..

పనులు పూర్తయినా ప్రారంభం కాని వైనం

తెలంగాణ యూనివర్సిటీకి కేంద్ర ప్రభుత్వం రూసా ద్వారా బాలికల హాస్టల్ మంజూరు అయిందని వర్సిటీ అధికారులు చెబుతున్నా ఇంతవరకు పనులు ప్రారంభం కావడం లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ డిపార్టుమెంట్ల ద్వారా వర్సిటీకి రెండు బాలికల హాస్టల్ మంజూరయ్యాయి అందుకు సంబంధించి మంజూరు పత్రాలను ప్రస్తుతం రిజిస్ట్రార్‌గా ఉన్న యాదగిరి నాటి మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ చేతుల మీదుగా రవీంద్ర భారతిలో అందుకున్నారు. ఆ ఫైల్ ఎటు పోయిందో ఉన్నతాధికారులకే తెలియాలి.

స్నాతకోత్సవానికి గవర్నర్ హాజరయ్యే అవకాశం?

తెలంగాణ యూనివర్సిటీ రెండవ స్నాత కోత్సవం జూలైలో జరిగే అవకాశం ఉంది అందులో భాగంగా ఇటీవల వైస్ చాన్స్‌లర్ యాదగిరి రావు, గవర్నర్ ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆ లోపైనా తెలంగాణ యూనివర్సిటీలో బాలికల హస్టల్‌కు శంకుస్థాన చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

అపూర్వం విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అర్గుల్ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



పల్లికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

జక్రాన్‌పల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్గుల్ గ్రామంలో మైత్రి గార్డెన్‌లో ఆదివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2004-25 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరుపు కున్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకొని నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పల్లికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

భీమ్‌గల్ రూరల్: భీమ్‌గల్ మండలంలోని పల్లికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2002-2003 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. 22 ఏళ్ల తర్వాత తమ కుటుంబ సభ్యులతో సహ సమ్మేళనానికి హాజరై ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా తమకు చదువు నేర్పిన ఉపాధ్యాయులు శాంబ శివరావ్, రాజేందర్, బాల్‌రాజ్, ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రభాకర్, శంకర్, సదానందం, ఈశ్వర్, శ్రీనివాస్, కృష్ణ, శేఖర్, గంగాధర్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ప్రసాద్, సదా, శ్రీకాంత్, సుమన్, సయ్యద్ అజారుద్దిన్, గంగప్రసాద్, నరేష్, శివానంద్, రజిత, స్వప్న, సునిత, తదితరులు పాల్గొన్నారు.

ముల్లంగిలో బోనాల ఊరేగింపు



ముల్లంగిలో మహాలక్ష్మీ ఆలయంలో బోనాలు సమర్పిస్తున్న మహిళలు

డిచ్‌పల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముల్లంగి(ఐ)లో ఆదివారం వీడీసీ ఆధ్వర్యంలో గ్రామం లో ఈ ఏడాది పాడి పంటలు సమృద్ధిగా పండాలని చెరువులు నిండాలని ప్రార్థిస్తు మహాలక్ష్మీ ఆలయంలో పెద్ద ఎత్తున మహిళలు బోనాలు నేవేధ్యాలు అమ్మవారికి సమర్పించుకున్నారు. గ్రామ దేవతలకు ఊరేగింపు నిర్వహించి ప్రతిష్ఠింపజేశారు. బోనాలు ఊరేగింపు చేశారు. అనంతరం కొబ్బరి కాయలు కొట్టారు. ఈ కార్య క్రమంలో మహిళలు, యువకులు, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని గ్రామ దేవతలకు జలాభిషేకం

ఆర్మూర్ టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సర్వసమాజ్ ఆధ్వర్యంలో ఆదివారం కులసంఘ సభ్యులు గ్రామదేవతలకు జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం రాత్రి సంఘ సభ్యులు గోదావరి నీటి జలాలకోసం పోచంపాడ్‌కు బయల్దేరి వేకువజామున గోదావరి జలాలు తీసుకువచ్చారు. వారిని ఊరి పొలిమేర నుంచి సర్వసమాజ్ సభ్యులు, కులసంఘ సభ్యులు డప్పు వాయిద్యాలతో స్వాగతం పలికి గ్రామ దేవతలకు జలాభిషేం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్వసమాజ్ ప్రజాఐక్య సమితి అధ్యక్షుడు కొట్టాల సుమన్, కార్యదర్శి కర్తన్ దినేష్, కోశాధికారి బక్కోల్ల రవి, సదర్‌క్యాషియర్లు తెడ్డు బాల్‌రెడ్డి, గుండు సాయన్న, సదార్లు పుప్పాల గిరి, గోర్త దేవేందర్, లోక దశరత్, గుండు బాజన్న, సర్వసమాజ్ సభ్యులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: ఈసారి కూడా పుష్కలంగా వర్షా లు కురిసి చెరువులు నిండి పంటలు పండాలని వరుణ దేవుడిని వేడు కుంటూ మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం గ్రామ దేవతలకు గంగనీళ్లతో జలాభిషేం చేశారు. తొర్లికొండలో గంగనీళ్లను ఊరేగింపుగా తీసుకెళ్లి గ్రామదేవతలకు జలాభిషేకం చేశారు. వివిధ గ్రామాలలో గంగ నీళ్లతో గ్రామదేవతలకు జలాభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్రాను. అనంతరం గ్రామాలలో ప్రజలు వనబోజనాలకు వెళ్లారు.

నాగంపేట్‌లో..

ముప్కాల్: మండలంలోని నాగంపేట, రెంజర్ల గ్రామాలలో ఆదివారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామదేతలకు గంగనీళ్లతో అభిషేకం నిర్వమించారు. గ్రామస్తులు ఉదయం గోదావరి నుంచి గంగజలాన్ని తీసుకువచ్చి గ్రామశివారు నుంచి వలగొడుగు, డప్పు వాయిద్యాలతో గంగా జలాలను గ్రామవీధుల గుండా ఊరేగించారు. గ్రామంలోని అన్ని గ్రామ దేవత విగ్రహాలను గంగాజలాలతో అభిషేకం చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండి అందరు ఆరోగ్యంగా ఉండాలని గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు.



ఆర్మూర్‌లో గోదావరి గంగజలాలను తీసుకువచ్చిన పలు కులసంఘాలు



తొర్లికొండలో..



గోదావరి నుంచి గంగజలాలు తీసుకువస్తున్న గ్రామస్థులు

ఉగ్రవాయి బీరప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు


పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

కామారెడ్డిటౌన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మండలం ఉగ్రవాయి గ్రామంలోని బీరప్ప ఆలయంలో శుక్రవారం ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులసంఘాల బలోపేతానికి కృషిచేస్తానని ఇచ్చిన హామీ మేరకు ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని తెలిపారు. ప్రతిఒక్కరు తమ ఆలయాన్ని, సంఘాన్ని బలోపేతం చేసేందుకు ముందుకు రావాలని అలాంటప్పుడే ఎవ రికి ఏ ఆపద వచ్చిన ఒకరికి ఒకరు తోడుగా ఉండే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో కురుమసంఘం నాయకులు పాల్గొన్నారు.

లక్ష్మీ గోదాదేవి సమేతంగా శ్రీవారి కల్యాణ మహోత్సవం


బీర్కూర్ టీటీడీలో శ్రీవారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

బీర్కూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో శ్రవణ నక్షత్రం సందర్భంగా శ్రీ లక్ష్మీ గోదాదేవి సమేతంగా శ్రీవారి కల్యాణ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. వేద పండితుల మం త్రోచ్ఛరణాల మధ్య కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఐదు జంటలు కల్యాణాన్ని జరిపించారు. స్వామివారికి అమ్మ వార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తులు కల్యాణమట్టాన్ని కనులార వీక్షించి తరించారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యు లు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ ఆలయంలో చోరీ


గ్రామ శివారులో ఆలయ హుండీని పరిశీలిస్తున్న గ్రామస్తులు

ఎల్లారెడ్డి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండలంలోని హాజీపూర్ తండాలోని జగదాంబ మాతా సేవాలాల్ ఆలయంలో శనివారం అర్ధ రాత్రి చోరీ జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం హాజీపూర్ తండాలో ఉన్న సేవాలాల్ ఆలయంలో పూజారి దూప్య నాయక్ రోజువారి లాగే పూజలు నిర్వహించి అనంతరం ఆలయానికి తాళం వేసి వెళ్లారు. ఆదివారం ఉదయం పూజారి పూజ చేయడానికి ఆలయానికి వెళ్ళగా ఆలయంలో ఉన్న హుండీ కనిపించకపోవడంతో గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో గ్రామస్తులు ఆలయం ఆవరణ చుట్టూ వెతకగా శివారు ప్రాంతంలో తాళాలు పగలగొట్టి కనిపించిందని దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని ఎల్లారెడ్డి పోలీసులు పరిశీలించి క్లూస్ టీమ్ కు సమాచారం ఇచ్చారు. హుండీలో దాదాపు 30 వేల నగదు ఉంటుందని గ్రామస్తులు తెలిపారు.

టీపీసీసీ ప్రధాన కార్యదర్శిని కలిసిన నాయకులు


టీపీసీసీ ప్రధాన కార్యదర్శిని కలిసిన మండల కాంగ్రెస్ నాయకులు

తాడ్వాయి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డిని ఆదివారం మండల కాంగ్రెస్ నాయ కు లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం మం డల కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠ గురించి అడిగి తెలుసుకున్నారు. ఇందులో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబీర్ శ్యామ్ రావు, సీనియర్ కాంగ్రెస్ నాయకు లు వెంకట్ రెడ్డి ఉన్నారు.

'పాఠశాల అభివృద్ధికి కృషి'

రాజంపేట, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండా రం గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో ఆదివారం వివేకానంద పూర్వ విద్యా ర్థులు గ్రామపెద్దలు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా మన బడిలో చదివే పిల్లలకు టై, బెల్ట్, ఐడీకార్డు, షూ, స్నాక్స్ సమకూర్చాలని పిచ్చి మొక్కలతో నిండిపోయిన స్కూల్ గ్రౌండ్ పూర్తిగా ప్రక్షాళన చేయాలని వివిధ రకాల పూలమొక్కలతో పిల్లల ఆట స్థలాన్ని ఆధునికరించాలని, కూలిపోయిన ప్రహరీని పునః నిర్మించే వరకు ఇనుపజాలితో కంచే ఏర్పాటుచేయాలని తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



పాల్గొన్న పూర్వ విద్యారులు, గ్రామస్తులు

పూర్వవిద్యార్థుల సమ్మేళనాలు


సదాశివనగర్‌లో పాల్గొన్న పూర్వ విద్యార్థులు


గోపాల్‌పేట్ హైస్కూల్‌లో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సదాశివనగర్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): సదాశివనగర్ మండల కేంద్రంలోని లక్ష్య గ్రాండ్ ఫంక్షన్‌హాల్‌లో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల 1999-2000సంవత్సరానికి చెందిన పూర్వవిద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని సరస్వతిమాత విగ్రహానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో మధుర అనుభూతులను ఒకరినొకరు పంచుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు తిరుపతిరెడ్డి, ఖదీర్,లావణ్యను శాలువాతో సన్మానించి మెమొంటో అందజేశారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు శ్రీకాంత్ మామిడాల, గర్దాస్ కిషోర్, మార సత్యనారాయణ, ఆశన్న, నరేందర్, సంతోష్, పుష్పలత, కృష్ణ, నవత, రాధిక, సులోచన పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట : మండల కేంద్రంలోని గోపాల్ పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000-2001 విద్యా సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వవిద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. ముందుగా అమరులైన ఉపాధ్యాయుల, విద్యార్థుల ఆత్మశాంతి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించి ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ప్రారంభించారు. ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ద్వారా సుమారు 25 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులు ఒకే చోట కలిసి తమ విద్యార్థి దశలోని పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబోధన చేసిన అప్పటి ఉపాధ్యాయులు మల్ల గౌడ్, మాణిక్యం, కృష్ణారెడ్డి, గోవర్ధన్‌లను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రాజు, హన్మన్మండ్లు గౌడ్, షాబుద్దీన్, నజీర్, షైను, శ్రీనివాస్ గౌడ్, నాగ ప్రసాద్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన 1983-84 సంవత్సరానికి చెందిన 10వ తరగతి విద్యార్థులు ఆదివారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. సమ్మేళనంలో సుమారు వందమంది పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదివిన అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆనందోత్సవాలతో గడిపారు. వారికి చదువు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. వీరిలో రాములు, మర్రి సత్యనారాయణ, బాలకిషన్, ఇబాద్, రాజశేఖర్, రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


ఎల్లారెడ్డిలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కామారెడ్డిటౌన్: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సిద్దార్థ జూనియర్ కళాశాలలో 1999-2001లో చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఇంటర్ పూర్తిచేసుకుని 25 సంవత్సరాలు అయినందున కామారెడ్డిలో కలుసుకుని ఒకరికొకరు అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ప్రస్తుతం వారు చేస్తున్న పనులు వారి కుటుంబ వివరాలను చెప్పుకుంటూ ఆనందంగా గడిపారు.


కామారెడ్డి ఆత్మీయసమ్మేళనంలో కలిసిన పూర్వ విద్యార్థులు

కొడుకును హత్య చేసిన తండ్రి అరెస్టు


సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎల్లారెడ్డి సీఐ రవీందర్

● ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్

నాగిరెడ్డిపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కొడుకును చంపిన తండ్రిని అరెస్ట్ చేశారు. భార్యపై కోపంతో ముక్కుపచ్చలారని తన సొంత నాలుగేళ్ల కుమారుడు శశాంక్‌ను నోరు, ముక్కుమూసి ఊపిరాడకుండా చేసి హత్య చేసిన తండ్రి నర్వ అనిల్‌ను ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్ తెలిపారు. ఆయన ఆదివారం నాగి రెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి హత్యకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. లింగంపేట్ మం డలం పోల్కంపేట్ గ్రామానికి చెందిన నర్వ అనిల్‌తో నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం గ్రామానికి చెందిన అక్షితతో వివాహం జరిగింది. ఈ దంపతులకు నాలుగేళ్ల శశాంక్, ఏడు నెలల కూతురు ఉందని తెలిపారు. కాగా ఈ నెల 10వ తేదీన వీరు మెదక్ జిల్లా శాలిపేట్ గ్రామంలో తన చెల్లెలు నిర్వహించిన ఫంక్షన్‌కు హాజరయ్యారు. అక్కడ చిన్నపిల్లల మధ్య జరిగిన తగాదాలను మనసులో పెట్టుకొని పోల్కంపేట్ వెళ్లి అక్కడ భార్యపై కోపంతో చేయి చేసుకున్నాడని తెలిపారు. ఈనెల 12న గురువారం భార్య పుట్టిల్లు పోచారం గ్రామానికి వచ్చారని, అదే రోజు కుమారుడు శశాంక్‌ను గ్రామంలో తిప్పుకొస్తానని భార్యకు చెప్పి కుమారుడిని ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని పోచారం ప్రాజెక్టు వద్ద గల ఎల్లమ్మ ఆలయం సమీపంలో తన కుమారుడు శశాంక్ ముక్కు, నోరు మూసి ఊపిరి ఆడకుండా చేసి హత్య చేశాడని సీఐ వివరించారు. ఈ విషయమై అనిల్ భార్య అక్షిత నాగిరెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతుడిని పోస్టుమార్టం నిర్వహించినట్లు తెలిపారు. కేసు విచారణ జరిపి నిందితుడు నర్వ అనిల్‌ను మెదక్ జిల్లా బూర్గుపల్లి గేట్ వద్ద ఆదివారం పట్టుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ రవీందర్ నాయక్ తెలిపారు. నిందితుడు ఉపయోగించిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మల్లారెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

బోనస్‌కు నిరీక్షణ

(5వ పేజీ తరువాయి)

కొనుగోలు చేయగా ఇందులో 1,67,299 మెట్రిక్ టన్నుల సన్నాలే కావడం గమనార్హం. సన్నాలే ఎక్కువగా కొనుగోలు కేంద్రాలకు వచ్చాయి. అయితే కేవలం రెండు రోజుల్లోనే రైతులకు పూర్తిస్థాయిలో ధాన్యం డబ్బులు పడుతాయని అధికారులు చెబుతున్నా ఎక్కడా అమలు కావడం లేదు. కనీసం మద్దతు ధర ప్రకారం ధాన్యం డబ్బులు జమ అయ్యేందుకు దాదాపు వారం రోజులు పడుతుండగా రూ.500ల చొప్పున ప్రభుత్వం ఇచ్చే బోనస్ డబ్బులు 25 రోజులు దాటినా పడడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి సకాలంలో బోనస్ డబ్బులు ఖాతాలో జమ చేయాలని వేడుకుంటున్నారు

త్వరలోనే బోనస్ డబ్బులు

● రాజేందర్, పౌర సరఫరాల శాఖ డీఎం

సన్న రకం ధాన్యానికి సంబంధించి బోనస్ డబ్బులు ప్రభుత్వం నుంచే రావాల్సి ఉంది. జిల్లాలో 3.82లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా రైతుల ఖాతాలో రూ.850 కోట్ల ధాన్యం డబ్బులను జమ చేశాం. ఇందులో సన్న రకం 1.67 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశాం. ఇందుకు సంబంధించిన బోనస్ డబ్బులు రూ.88 కోట్లు అవుతాయి. దీనికి సంబంధించి ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయడంతో పాటు ప్రభుత్వానికి పంపాం. ప్రభుత్వం నుంచే బోనస్ డబ్బులు రావాల్సి ఉంది.

ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయాలి

భిక్కనూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. ఆదివారం భిక్కనూరుకు చెందిన కాంగ్రెస్ నాయకులు ఇటీవల పీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియామకమైన ఆయనను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ సీట్లు సాధించే విధంగా సమన్వయంతో ముందుకు సాగుదామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ద్యాగల కిరణ్, రాంచంద్రం, అశోక్, మల్లేషం, ఎల్లం, దుర్గయ్య, నరహరి, లింగం, తదితరులు పాల్గొన్నారు.


పీసీసీ ప్రధాన కార్యదర్శిని సన్మానిస్తున్న దృశ్యం

నోటు పుస్తకాల పంపిణీ


రాజంపేట్‌లో నోటుపుస్తకాలు అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు


క్యాసంపల్లిలో...

రాజంపేట, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రాజంపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం గంగపుత్ర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లా బాలికల, బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచిత నోటు పుస్తకాలు అందించారు. ప్రభుత్వ పాఠశాలలో పుస్తకాలు అందించాలనే ఉద్దేశ్యంతో 7 నుంచి 10వ తరగతి విద్యార్థులకు దాతలు అందించిన విరాళాలతో పుస్తకాలు అందించామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో పూర్ణచందర్‌రావు, ప్రధానోపాధ్యాయులు ఈశ్వరయ్య, విజయలక్ష్మీ, రిటైర్డ్ ఎక్సైజ్‌కస్టం సూపరిటెండేంట్ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డిటౌన్ : కామారెడ్డి మండలం క్యాసంపల్లి మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు ఫ్రెండ్స్ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో నోటుబుక్స్ పంపిణీచేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందుతున్నాయని విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నందున తమ వంతు సహాయంగా నోటుబుక్స్ అందించామని తెలిపారు. భవిష్యత్తులో పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయసహకారాలు అందిస్తామని తెలిపారు.

కూరగాయల చేనులో దిష్టిబొమ్మ


కూరగాయ చేలో రైతు ఏర్పాటు చేసిన దిష్టిబొమ్మ

పెద్దకొడప్‌గల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా రైతన్నలు తాము సాగుచేస్తున్న పంట బాగా పండి దిగుబడి అధికంగా రావాలని ఆశిస్తుం టారు. అలా పంట దిగుబడి బాగా రావడానికి ఒక్కొక్కరు ఒక పాలసీ పాటిస్తుంటారు. కొందరు విత్తనాలు నాణ్యమైనవి ఎంచుకుంటే, మరి కొందరు పంట చేతికి వచ్చే సమయంలో పంట ఇతర జంతువులు తినకుండా వలలు గాని, కంచెలు గాని వేస్తారు. ఇంక కొంతమంది పంట కనిపించకుండా చీరలు చుడుతుంటారు. ఇదే విధంగా మండలంలోని వడ్లం గ్రామ శివారులో టమాట పంట సాగు చేస్తున్న రైతు తన పంటకు ఇతరులు దృష్టి తగలకుండ దిష్టిబొమ్మను చేలో ఏర్పాటు చేశారు. దీంతో ఆ రహదారి గుండా ప్రయాణించేవారి చూపు పంటపై కాకుండ దిష్టిబొమ్మపై పడుతుంది. మరోవైపు పశువులు తినకుండా ఉపయోగపడుతుందని పలువురు అంటున్నారు.

వృత్తిధర్మాన్ని అంకితభావంతో నిర్వర్తించాలి

● భిక్కనూరు సీఐ సంపత్‌కుమార్


బదిలీపై వెళ్తున్న పోలీసుసిబ్బందిని సన్మానిస్తున్న దృశ్యం

భిక్కనూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): బది లీలు ఉద్యోగులకు సర్వసాధారణమని, ఎక్కడ ఉన్న వృత్తిధర్మాన్ని అంకితబావంతో నిర్వర్తి స్తూ మంచిపేరును సంపాదించుకోవాలని భిక్కనూరు సీఐ సంపత్‌కుమార్, ఎస్సై అంజ నేయులు అన్నారు. ఆదివారం భిక్కనూరు పోలీసుస్టేషన్ ఆవరణలో సర్కిల్ పరిధిలోని ఆయాపోలీసుస్టేషన్‌ల నుంచి బదిలీపై వెళ్తు న్న 11మంది సిబ్బందికి ఘనంగా వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లా డుతూ విధుల పట్ల అంకిత భావం, క్రమశిక్షణ కలిగిన ఉద్యో గులు ఏ ప్రదేశంలో విధులు నిర్వ హించిన సంతృప్తికరమైన జీవి తాన్ని గడుపుతారని అన్నారు. అన్నిఉద్యోగాల కంటే పోలీసు ఉద్యోగం సమా జంలో చాలా కీలకమైనదని, ఇన్నిరోజులు భిక్కనూరు సర్కి ల్‌లో విధులు నిర్వహించి తమ కుటుంబ సభ్యుల్లాగా మెదిలారని, మీరు బదిలీపై వెళ్లడం కొంత బాధగా ఉన్న ప్పటికీ బదిలీలు సహజమని అన్నారు. అనం తరం వారందరిని శాలువలతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో సర్కిల్ పరిది సిబ్బంది పాల్గొన్నారు.

ఎడాపెడా విద్యుత్ కోతలు

● నిత్యం మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పేరుతో కరెంట్ కట్
● సరఫరాలో గంటల పాటు అంతరాయం
● ఇబ్బంది పడుతున్న ప్రజలు

ఎల్లారెడ్డి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కరెంటు కోతలతో జనం అవస్థలు పడుతున్నారు. గంటల తరబడి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో జనాలు ఉక్కపోతతో ఊక్కిరి బిక్కిరి అవుతున్నారు. చిన్నపాటి గాలివాన వచ్చిన విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది చిన్న సమస్య ఎదురైన గంట నుంచి రెండు గంటలకు పైగా విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని అధికారులు గుర్తించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. వారంలో ఒకటి రెండు రోజులు మరమ్మత్తులు చేసే బాగుంటుంది కానీ ప్రతిరోజు మరమ్మత్తులు అంటూ విద్యుత్ కోతలు విధించడంతో తీవ్ర ఈ బాధలు పడుతున్నామని పట్టణ గ్రామీణ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరిస్తున్నాం

● విజయ సారథి, డీఈ



ఎక్కడ సమస్య వచ్చినా తక్షణమే పరిష్కరిస్తున్నాం. గాలి, వాన వస్తే సమస్య వస్తుంది. అక్కడక్కడ చెట్ల కొమ్మలతో సబ్ స్టేషన్లలో మరమ్మత్తులతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తిరిగి విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్నాం. నిర్వాహన పనులు చేసేటప్పుడు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ముందస్తుగా తెలియజేస్తున్నాం.

నేడు వీసీ యూనిట్స్ ప్రారంభం

కామారెడ్డిటౌన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నూతనంగా 47 రైతు వేదికలలో సోమవారం 47 వీసీ యూనిట్స్‌ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తున్నట్లు డీఏఓ తిరుమలప్రసాద్ తెలిపారు. జిల్లాలో ఇప్పటికే ఉన్న 25 వీసీ యూనిట్స్ కలిపి మొత్తం 72 రైతు వేదికలలో ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నామని తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 6 గంటలవరకు ఈ కార్యక్రమాన్ని అధికసంఖ్యలో వీక్షించాలని తెలిపారు. ప్రతి మంగళవారం 72 రైతువేదికలలో వీసీ యూనిట్స్ ద్వారా రైతులకు కావాల్సిన శాస్త్రసాంకేతిక విషయాలు వ్యవసాయంలోని మెళుకవులు, రైతు సర్వతోముఖాభివృద్ధికి అవసరమయ్యే కార్యక్రమాలు రైతునేస్తం అనే కార్యక్రమం ద్వారా ప్రసారం చేస్తామని తెలిపారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి
దర్శన్ - కరాటే కిడ్
ప్రియా 70 - భైరవం
ప్రియా 35 - తొలిప్రేమ

బాన్సువాడ
మహేశ్వరి - థగ్ లైఫ్
వెంకటేశ్వర - శ్రీశ్రీశ్రీరాజావారు

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	180	220	240
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

